


# ఏకాక్షి

వేదుల లక్ష్మణమూర్తి

"ఏకాక్షి లోకసంహారి' అంటారు కాని ఈలోకోక్తి సూరి మూర్తికి వర్తించదు-

— "అతి వినయం ధూర్త లక్షణం" అనే నానుడి కూడా వానికి చెందదు-

ఊళ్ళో వాళ్ళందరికీ సూరిమూర్తి మీద ఒకేఒక అభిప్రాయం పాతుకపోయింది. సూరిమూర్తి దేవుడి లాంటి మనిషి. మంచితనం, వినయం, పరోపకారం, పారమార్థిక చింతన, దైవభక్తి, ప్రేమాభిమానాలు మొదలైన మంచి గుణాలన్నీ చేరి సూరిమూర్తిగా రూపొందాయని చాలమంది అనుకొంటూంటారు.

పాతికేళ్ళ వయస్సులో పొట్ట చేత్తో పట్టుకొని కట్టుగుడ్డలతో అనాథగా ఆ వూరు నాశ్రయించిన వాడు, పదేళ్ళ కాలంలో తనకో స్వంత యిల్లు, పదెకరాల భూమి, సంపాదించుకున్నాడంటే అదంతా వాని మంచితనమే అని కొందరి అభిప్రాయం. రాత్రింబవళ్ళు వాని అవిరళ కృషియే వాని అభివృద్ధికి కారణమని మరి కొందరనుకుంటారు. వాని సత్ప్రవర్తనకి సంతోషించి భగవంతుడు వానికి ఐశ్వర్యం అనుగ్రహించాడని చాలా మంది చెప్పుకుంటారు.

అధరము కదలీ కదలక మధురముగా మాటలాడు మనుజు డెవరంటే ఆ వూళ్ళో సూరిమూర్తి నొక్కణ్ణే చెప్పుకోవాలి. తాను దరిద్రస్థితిలో వున్నప్పుడు కూడా పర ధనము నాశించక పోవడం, స్వంత స్త్రీ అనగా పెళ్ళి చేసుకున్న భార్య లేకపోయినా పర స్త్రీని కన్నెత్తి చూడ్డంగాని వాని లక్షణాలు కాదని ప్రతీతి.

ఆ వూరు చేరిన కొత్తలో పొట్టిగా పీలగా పచ్చగా వరువు కొచ్చిన మామిడికాయలా వుండేవాడు సూరిమూర్తి. ముఖం పచ్చగా నిండుగా వుండేది. కళ్ళు విశాలంగా వుండేవి. దుబ్బులా పెరిగిపోయిన నల్లని క్రాపు తాటిముంజిలోని కన్నులా వున్న ఒక చెడిపోయిన కన్ను మాత్రం వానిలోని అందాన్ని ఆకర్షణనీ మరుగు పరుస్తూండేవి.

రమారమి ఐదు వందల యిళ్ళు గల ఆ చిన్నవూళ్ళో ఎవరికి ఏకష్టమొచ్చినా సూరిమూర్తి సహాయం, సలహా తప్పక ఉండేవి. జబ్బులు మరణాలు లాంటివి పొరుగింటి వాళ్ళకంటె ముందుగా సూరిమూర్తికి తెలిసేవి. వెంటనే వాళ్ళింటికి రెక్కలు గట్టుకొని వాలేవాడు. సమయాసమయాలతో గాని, కులగోత్రాలతో

గాని, మనుషుల యొక్క తక్కువ విలువలతో గాని వానికి నిమిత్తం లేదు. ఒక యింట్లో ఒక వ్యక్తికి జబ్బు చేసిం ద చేతిలేక మరణించాడంటే పొరుగు వాళ్ళు కంటె ముందుగా సూరిమూర్తి అక్కడికి హాజరయేవాడు. రమారమి ఒక వంద కుటుంబాలవాళ్ళకిసూరిమూర్తి తల్లోని నాలుక.

ఎవరినీ పేరెట్టిపిలవడంవానికలవాటు లేదు. ముసలివాళ్ళని మామ్మగారు,తాత గారు అనీ, పెద్ద వాళ్ళని పిన్నిగారు, బాబుగారు అనీ, ఇంచుమించు సమాన వయసున్నగల వాళ్ళని అన్న, తమ్ముడు అక్కచెల్లాయ్ అనీ, పిల్లల్ని బుల్లెమ్మ, చిన్నమ్మ,చిట్టితల్లి, చిన్నబాబు,బుజ్జబాబు బంగారుబాబు అనే ముద్దు పేర్లతో అభి మానం, ఆదరణ, ఉట్టిపడుతూ పలుక రించేవాడు. యోగక్షేమాలు అడుగు తుండేవాడు. ఎవరింట్లోకైనాస్వతంత్రంగా ఆ యింట్లోని మనిషిలా వెళ్ళగల చనవు సూరిమూర్తికి మాత్రమే వుంది.

ఇప్పుడు సూరిమూర్తి వయస్సు ముప్పై అయిదు సంవత్సరాలు. పచ్చగా బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా స్వచ్ఛమైన పంచ, లాల్చీ ధరించి ఆకర్ష ణీయంగా కనుపిస్తాడు. లేత నీలిరంగు అద్దాలు గల గోల్డుఫ్రేము కళ్ళజోడు వాని ముఖంలోని కంటి లోపాన్ని కనుపించకుండా చేస్తూంటుంది. వీటన్ని టినీ మించినది వాని వాక్కు. మృదువుగా మందంగా, స్వచ్ఛంగా, చమత్కారంగా హాస్య ధోరణితో వుండే వాని మాటలు ఎంతసేపు విన్నా విసుగెత్తదు. వాని వాగ్ధోరణితో యెదుటి వారి మంచి, శ్రేయస్సు, ఉపకారం ధ్వనిస్తూంటాయి.

సూరిమూర్తి విశేషించి చదువుకున్న వాడుకాడు. ఉద్యోగం లేదు. చదువుతో నిమిత్తం లేని వృత్తి గాని వ్యాపారం గాని లేదు రాజకీయవేత్త అంతకంటే కాదు యాచన, దొంగతనం, జూదం లాంటి హీన కార్యాలు అతనెప్పుడూ చెయ్యలేదు. పెళ్ళి చేసుకోలేదు గనుక సంసారం లేదు.

ఒక యెకరం దొడ్డిలో కొబ్బరిచెట్ల మధ్య అందమైన చిన్న డాబా వాని స్వంత నివాసం. నాలుగేళ్ళయింది అతనా డాబా కట్టించుకొని. అంతకు ముందు వరకు అక్కడొక పూరిల్లు ఉండేది దుర్గమ్మ అనే శత వృద్ధురాలు ఆ యింట్లో వుండేది. ఆవిడకి యిల్లూ దొడ్డీ తప్ప మరేవిధమైన ఆస్తిపాస్తులూ లేవు. నావాళ్ళని చెప్పుకోదగిన ఆత్మీయు లెవరూ ఆమెకులేరు.

ఆ వూరు చేరిన ఆరు మాసాలకి సూరిమూర్తి దుర్గమ్మ యింట్లో మకాం పెట్టాడు. తన మంచి మాటలతోను. సేవా శుశ్రూషలతోను మరి కొన్నాళ్ళకి దుర్గమ్మకి అభిమాన పుత్రుడయ్యాడు మరి నాలుగేళ్ళకి తన యింటినీ దొడ్డినీ సూరిమూర్తికి వ్రాసి యిచ్చేసి పరలోకా నికి పయనించిందా ముసలమ్మ.

ఆ మరుసటి సంవత్సరం. సూరి మూర్తి లాటరీలో లక్ష రూపాయలు గెల్చుకున్నాడని ఊరూ వాడా చెప్పు కున్నారు యాభై వేలతో నాలుగెకరాల పంటభూమి కొన్నాడు. పాతిక వేలతో అందమైన డాబా కట్టించుకున్నాడు. మరో నాలుగేళ్ళకి పదెకరాల భూస్వామి

అయాడు సూరిమూర్తి.

పెళ్ళి చేసుకొనమని అనేకమంది పదే పదే సలహా లివ్వసాగారు. నాకు పెళ్ళెందుకని నవ్వి వూరుకొనేవాడు కొంతమంది మా పిల్లనిస్తాం చేసుకొనమని వొత్తిడిచేశారు. నేను పెళ్ళిచేసుకోనని ఖచ్చితంగా వాళ్ళకిచెప్పి పంపేశాడు.

అన్నింటినీ మించి చెప్పుకోదగిన దేమంటే, ఈ పదేళ్ళ కాలంలోను సూరిమూర్తి యెప్పుడూ స్వంత తిండి తినలేదు. భోజనాల వేళకి యెవరింటికివెడితే ఆయింటి మామ్మగారో, పిన్నిగారో, అక్కయ్యో చెల్లెమ్మో వానికి ఆదరాభిమానాలతో భోజనం పెట్టేది.

లోకులందరిచేత దేవుడులాంటి మనిషనిపించుకున్న సూరిమూర్తి. ఆపద్బాంధవుడని పేరు సంపాదించుకున్న సూరిమూర్తి, నీతి నిజాయితీలకు ముందుగా పేర్కొనదగిన సూరిమూర్తి. సత్ప్రవర్తన సౌశీల్యం గలవాడనిపించుకున్న సూరిమూర్తి. వూరివారందరికీ ప్రేమాభిమానాలు పంచి యిచ్చిన సూరిమూర్తి. ఇప్పుడా వూరివారికేగాదు ఈ లోకానికే దూరమయాడు. అందమైన తన డాబా యింటి వరండాలో సింహద్వారాని కడ్డంగా చచ్చి పడివున్నాడు. కాదు, కాదు హత్య చెయ్యబడ్డాడు! ఇంతటి ఘోరం సూరిమూర్తి విషయంలో జరుగుతుందని యెప్పుడూ ఎవ్వరూ కల్లోకూడా తలచి వుండరు

తెల్లవారేసరికి ఊరూవాడా వ్యాపించి పోయిందీ దుర్వార్త. ఏ వీధిలో ఏ యింటిలో చూచినా గోలగోలగా వుంది. ఇంకా నిద్రలేవని పిల్లల్ని సహితం నిద్రలేపి ఈ వార్త చెప్పి సూరిమూర్తి యింటికి ఉరకలూ పరుగులతో వెళ్ళిపోయారందరూ. అరగంటలో సూరిమూర్తి యింటి ఆవరణ, ఎదుటిరోడ్డు స్త్రీ పురుషులతోను పిల్లలతోను నిండిపోయాయి. ఎవరికివారే వరండా దగ్గరకి వెళ్ళి సూరిమూర్తిని ఆదుర్దాతోను ఆవేదనతోను చూస్తున్నారు. రకరకాలుగా సూరిమూర్తి గుణగణాల్ని గొంతెత్తి చెప్పుకొంటున్నారు కొందరు పైకి యేడ్చేస్తున్నారు. కొందరు పొంగివచ్చే దుఃఖాన్ని గుట్టుగా బిగబట్టుకొని బిక్కమొహాలతో చూస్తున్నారు.

సూరిమూర్తి వొంటిమీద పొడవడం నరకడంలాంటి గుర్తులేమీలేవు. గాయం లేదు. రక్తపు మరకలేదు. కట్టుకున్న గ్లాస్కో పంచ. మెర్సిరైజ్డ్ పెట్ పాప్లిన్ షర్టు తెల్లగా మెరసిపోతున్నాయి. సువాసననూనె రాసిన పొట్టిక్రాపు నల్లగా నిగనిగలాడుతోంది. కళ్ళజోడు వానికి దగ్గర్లో పడివుంది. ఎడమచేతి వ్రేలికి బంగారు వుంగరం, తెల్లనిపుష్యరాగంతో మెరుస్తోంది. ఆ చేతికే బంగారు గొలుసుతో రిస్టువాచి వుంది. స్పాంజి చెప్పుల జోడు వొకటి వూడిపోయి దూరంగా వుంది. మరివొకటి పాదానికి వ్రేలాడుతూన్నట్టుగా వుంది.

పాములాంటి విషజంతు వేదైనా కరచిందేమోనని మొదట అందరూ అనుకున్నారు. కాని శరీరం రంగులో మార్పేమీ లేదు. పైకివచ్చిన కంటి గ్రుడ్లనిబట్టి, పళ్ళు గిట్టకరచుకొనివున్న నోటినిబట్టి, ఎవరో గొంతుపిసికి చంపారని, దగ్గరికివచ్చి పరిశీలనగా చూచిన

వాళ్ళు నిర్ణయించారు.

గ్రామ మున్సబు, కరణం, సర్పంచ్ మొదలైన గ్రామాధికారులు వచ్చారు. ఆవూరికి జమీందారు లాంటి భూషణం గారు, లక్షాధికారి అనిపించుకొంటూన్న రంగయ్య షావుకారుగారు వచ్చారు. ఈ పెద్దలంతా, వచ్చి చూచిపోయే జనానికి అడ్డులేకుండా వరండాకి ఒక ప్రక్కగా నిలబడి ఆశ్చర్యంతోను విచారంతోను రకరకాలుగా చర్చించుకొంటున్నారు.

ఆవూరికి పదిమైళ్ళ దూరంలోవున్న పట్నంలోవుంది పోలీసుస్టేషను. హత్యకి సంబంధించిన రిపోర్టు, ఒకరు రాసి పంపాలన్నారు మున్సబుగారు.

"ఊరికి ఉపకారి, అజాతశత్రువైన ఈ సూరిమూర్తిని హత్య చేశారంటే నమ్మశక్యం గాకుండావుంది. ఇల్లు దోచుకొని పోడానికి వచ్చినవాళ్ళు చంపారనుకోడానికి వీల్లేదు. ఇంటి తాళమే తియ్యలేదు. తాళంచెవులు వాని జేబులోనే వున్నాయి" అన్నారు కరణంగారు.

"ఔనండీ, ఎవరో పీకపిసికి చంపారంటే నాకూ నమ్మకం కుదరడంలేదు. భరించలేని గుండె నొప్పిగాని డొక్కలో పోటుగాని వచ్చి గిలగిల్లాడి ప్రాణం విడిచాడనిపిస్తోంది" అంటూ ఇది హత్య కాదనే విషయాన్ని బలపర్చారు సర్పంచ్ గారు.

"ఐతే, అక్కడ మట్టి పాదాల ఆనవాళ్ళు వున్నాయి కదాండి? వాటినిచూస్తే యిద్దరు ముగ్గురు మనుషులు వచ్చినట్టనిపిస్తోంది మరి" అని తన సందేహాన్ని వెల్లడించారు రంగయ్య షావుకారుగారు.

"బాధతో గిలగిల కొట్టుకునేవాడు యెలాగైనా నిగ్రహించుకొని యింట్లో మంచంమీదకి చేరదామని ప్రయత్నించి వుంటాడు. అవన్నీ వాని అడుగులే అయి వుంటాయయ్యా! భరించలేని బాధతో ప్రాణాలు విడిచాడు గనకనే పళ్ళు గిట్ట కరచుకపోవడం, గుడ్లు తేలెయ్యడం లాంటి లక్షణాలు వచ్చాయండి" అన్నారు భూషణంగారు.

"ఐతే, ఇది హత్య కాదంటారు?" అన్నారు మున్సబుగారు.

# దేవుడు!

దేవుడన్న వాడు,
చాలా చెడ్డ వాడు!

మనం చెడుగా
వున్నంత వరకు
మంచిగా చూస్తాడు!

మంచి మనిషిగా
మారతామను కొనేంత లోగా
కష్టాల వర్షాన్ని
కురిపిస్తాడు.

అందుకే—
అతకాడు
"దేవుడు!"

ఎస్. విజేంద్రనాథ్ ప్రసాద్.

ఈ విధంగా చర్చించి చివరికిది హత్య కాదంటే- కాదని నిర్ధారణ చేశారు గ్రామాధికారులు. గ్రామపెద్దలు కలిసి.

"ఐతే, పోలీసు. రిపోర్టు యెందుకు లేనిపోనిబెడద?" అన్నారు,కరణంగారు.

"హత్య అనుకుంటే రిపోర్టుపంపాలి గాని హఠాత్తుగా గుండెపోటు వచ్చి మర ణించిన దానికి యేమీ చెయ్యక్కర్లేదు." అన్నారు మున్సబుగారు

....సూరిమూర్తి హత్య చెయ్యబడ లేదు. గుండెపోటు వచ్చి ఆకస్మికంగా మరణించాడు. పట్నం వెళ్ళి రాత్రి ఆల స్యంగా వచ్చాట్ట. ఇంట్లో యెవరూలేని కారణం చేత తెల్లవారేవరకూ యెవరికీ తెలీలేదు- అనే విషయాలు జనానికంద రికీ పెద్దలు తెలియజెప్పారు.

వెంటనే త్వరత్వరగా సూరిమూర్తి అంత్యక్రియకి యేర్పాట్లు ఆ పెద్దలే చేయించారు. కొన్ని వందలమంది వెంట రాగా సూరిమూర్తి శవాన్ని స్మశానానికి తీసుక వెళ్ళి దహన కార్యక్రమం జరిపిం చారు పెద్దలు

సూరిమూర్తి అంతిమ యాత్ర సవ్య ముగా జరిగిపోయింది.కాని కొన్ని రోజు లకి వూళ్ళో అపసవ్య సంఘటనలు జర గడం మొదలయాయి.

సూరిమూర్తి పోయిన రెండు రోజు లకి భూషణంగారి విధవ చెల్లెలు ఎండ్రిన్ తాగి చనిపోయింది. ఆవిడ పాతికేళ్ళ వయస్సులో నే నాలుగు లక్షల ఆస్తిని. వైధవ్యాన్ని వెంట బెట్టుకొని వచ్చింది. అన్నగారైన భూషణంగారి అంతఃపురం లోని ఒక సౌధంలో రాజులేని రాణివాసం చేస్తోంది.

మరి పది రోజులకి ఇంకో వార్త దుర్గంధంలా వూళ్ళో వ్యాపించింది షావు కారు రంగయ్యగారి పడుచు పెళ్ళాం పత్తాలేదని.

ప్రెంచ్‌గారి పెళ్ళి కాని పెద్ద కూతురు మంచం పట్టింది. జబ్బేమీలేదు. గర్భవతి అన్నదట పట్నంనుండి వచ్చిన లేడీ డాక్టరు.

సూరిమూర్తికి సంబంధించిన రహ స్యాలు ఒక్కొక్కటే నిలకడ మీద బయట పడుతున్నాయి. వాటి సారాంశ మేమనగా- సూరిమూర్తికి లాటరీలో లక్ష రూపాయలు రావడం నిజం కాదనీ అంతఃపుర పరిచయాలే వాని ఐశ్వర్యా నికి కారణాలనీ ఆ కారణంగానే అతను హత్య చెయ్యబడ్డాడనీ.



అనామిక